క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల విద్యార్థులను డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో అభినందించారు. గురువారం శ్రీశంకరానంద ఎయిడెడ్ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరప్రసాద్, డిగ్రీ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.కె.నాయుడు హాజరై ప్రతిభావంతులైన విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు సూచించారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆటోలు ఢీ : ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని ఎస్కేడీ ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో గురువారం రెండు ఆటోలు ఢీ కొని శ్రీనివాసులు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గుత్తి నుంచి పామిడికి బయలుదేరిన ఆటోను ఎదురుగా మరో ఆటో ఢీకొంది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పామిడికి చెందిన శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే శ్రీనివాసులును గుత్తి ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చదరంగం పోటీల్లో ప్రతిభ



కార్తీకేయన్

గుంతకల్లు: పట్టణంలోని బాష్యం హైస్కూల్ విద్యార్థి యూ.కార్తీకేయన్ (10) చదరంగం పోటీల్లో అంతర్జాతీయ రేటింగ్ సాధించినట్లు కోచ్ అనిల్‌కుమార్, రామారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత నెలలో బెంగళూరులో జరిగిన గ్రాండ్ మాస్టర్ బ్లిట్జ్ టోర్నీలో రెండు రేటింగ్ పాయింట్స్ పొందడం ద్వారా బ్లిట్జ్‌లో 1497వ అంతర్జాతీయ రేటింగ్ సాధించినట్లు తెలిపారు. గురువారం విద్యార్థి కార్తీకేయన్‌ను బాష్యం హైస్కూల్ హెచ్ఎం భార్గవితోపాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. భవిష్యత్‌లో మరింతగా రాణించి గుంతకల్లు కీర్తి ప్రతిష్టలు పెంచాలని ఆంకాక్షించారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



ఆర్డీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. గురువారం పట్టణంలోని ఎస్‌జేపీ హైస్కూల్ మైదానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసంతోపాటు మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. ఈ క్యాంప్‌లో దాదాపు 70 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకున్నట్లు ఆర్డీటీ గుంతకల్లు మండల కోచ్ కే.ఇనయాతుల్లా తెలిపారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని గుంతబావి వీధి నుంచి మండీబజార్ వాటర్ ట్యాంక్ వరకూ మెయిన్ పంపింగ్ పైప్‌లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్నందున 1,2,3,15,16,17,18,19,22, 23,29,30,36,37 వార్డులకు ఈ నెల 3 వరకూ నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. పైప్‌లైన్ పనులు పూర్తయ్యేందుకు ప్రజలు సహకరించాలని ఆయన గురువారం ఓ ప్రకటనలో కోరారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటక ప్రదర్శన



సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన దృశ్యం

పామిడి: మండలంలోని వంకరాజుకాలువ గ్రామంలో తెలుగుభాష సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో స్వరరాగ నాటక కళాసమితి సౌజన్యంతో బుధవారం రాత్రి నిర్వహించిన సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. నాటకంలోని నరహరి పాత్రధారి దేవరాజు నటన రంజింపజేసింది. కార్యక్రమంలో స్వరరాగ నాటక కళాసమితి సభ్యులు పుంజా కృష్ణారావుయాదవ్, దేవరాజు, రమణమూర్తి, ఆంథోని, నారాయణరెడ్డి, హనుమంతరెడ్డి, సుధాకర్‌రెడ్డి, చితంబరరెడ్డి, అరుణకుమారి, నాగవేణి, మస్తాన్ తదితరులు నటించారు. ఈ సందర్భంగా నటకిరీటీలు దేవరాజు, బెస్ట్ సుబ్రమణ్యం తదితరులను గ్రామపెద్దలు సత్కరించారు.

ప్రచార ఆర్భాటం

- రోడ్డు ఆక్రమణల తొలగింపునకు బ్రేక్
- అయోమయంలో పట్టణ ప్రజలు



పామిడిలోని బీసీసీ రోడ్డు అక్రమణల తొలగింపు స్థలంలో నిలబడిన వాహనాలు, తోపుడు బండ్లు

పామిడి: కూటమి ప్రభుత్వానిది అంతా ఆర్భాటమే అని ప్రజలకు స్పష్టమైంది. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు అభివృద్ధి పేరిట పామిడి పంచాయితీ ఈఓ ఎం గోపాల్ స్థానిక బీసీసీరోడ్డుకు ఇరువైపులా గల ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఆఘామేఘాల మీద జేసీబీతో గుత్తి–అనంతపురానికి వెళ్లే బీసీసీ రోడ్డుకు ఇరువైపులా గల ఆక్రమణల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. అయితే రోడ్డు వెడల్పు అయ్యి వాహనాల రాకపోకలతో పాటు ట్రాఫిక్ సమస్యను అధిగమించవచ్చన్న ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు. అక్రమణ తొలగింపు ఆరంభశూరత్వమై మూన్నాళ్ల ముచ్చటగా మారింది. అభివృద్ధి మాట అటుంచితే...ఉట్టికి, స్వర్గానికి లేకుండా అక్రమణల తొలగింపు ఆగిపోవడంతో పట్టణవాసులు ఇబ్బంది పడుతున్నారు.

అంతా హంగామా

ఆరునెలల క్రితం అభివృద్ధంటూ హంగామా చేశారు. అందులో భాగంగా స్థానిక బీసీసీ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగింపునకు గట్టి చర్యలు చేపట్టారు. అయితే నాలుగు నెలలుగా అక్రమణ తొలగింపును నిలిపివేశారు. దీంతో కొత్తలో కొందరిపై రోడ్డుపై గల ఆక్రమణల తొలగించి, మిగతా వారి రోడ్డుపై గల ఆక్రమణలను తొలగించక పోవడంపై అంతర్యమేమిటోనన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇందుకు అధికార పార్టీ నియోజకవర్గ ప్రతినిధికి, అధికారులకు రూ. లక్షలల్లో ముడుపులు అందాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. రోడ్డు ఆక్రమణల తొలగింపును అర్థాంతరంగా ఆపివేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొలగిస్తే ఆక్రమణలన్నీ తొలగించాలే గాని? ఇలా సగంలోనే ఆపేయడంపై బాధితుల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. ఇక ముందు రోడ్ల ఆక్రమణలు తొలగింపు ఉంటుందో? ఉండదో? అన్న అయోమయంలో ప్రజలు ఊగిసలాడుతున్నారు.

పనుల నిలిపివేతలో ఆంతర్యమేమిటో?



అభివృద్ధి అంటే ఏమిటో చూసి చూపుతామన్న కూటమి ఆక్రమణల తొలగింపు అర్ధంతరంగా ఆగిపోవడం వెనుక ఆంతర్యమేమిటో? అంతుబట్టని పరిస్థితి. ఏదైనా ముందస్తు ప్రణాళిక లేకుండా ఆక్రమణలు తొలగించడంతో చాలామంది పేదలు నిరాశ్రయులైయ్యారు. కొందరు రోడ్డుపై తాత్కాలిక షాపులు నిర్వర్తిస్తున్న వారి కడుపు మీద కొట్టినట్లైంది. రోడ్డు వైడింగ్ పుణ్యమా? అంటూ నిరుపేదలు రోడ్డున పడాల్సిన దుస్థితి నెలకొంది.

–కే రహీమ్, సీపీఐ నాయకుడు, పామిడి

తీరని ట్రాఫిక్ సమస్య



రోడ్డు వైడింగ్ వల్ల పేదలకు నష్టం వాటిల్లింది. రోడ్డు వైడింగ్ చేపట్టి డివైడర్ ఏర్పాటు చేస్తామన్న కూటమి ప్రభుత్వం అర్థాంతరంగా రోడ్డు ఆక్రమణలను ఆపివేసింది. దీంతో బీసీసీ రోడ్డుకు గల ఆక్రమణల స్థలం వాహనాలకు పార్కింగ్ స్థలమైంది. దీనికి తోడు పామిడి పంచాయితీ సాధారణ నిధులైన రూ.25లక్షలతో నిర్మించిన కూరగాయాల మార్కెట్ నిరుపయోగమవ్వడంతో తోపుడు బండ్లన్నీ రోడ్డుపైకి వచ్చాయి. దీంతో ట్రాఫిక్ సమస్య మొదటికొచ్చింది.

–పీ అనిమిరెడ్డి, సీపీఎంనాయకుడు, పామిడి.

నిధుల లేమితో పనులు ఆగాయి



పామిడిలో బీసీసీ రోడ్డుకు గల ఆక్రమణలను తొలగించి రోడ్డు వైడింగ్ చేపట్టాలనుకున్నాం. డివైడర్ ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలనుకున్నాం. రోడ్ల ఆక్రమణ తొలగింపునకు నిధుల లేమి అడ్డంకి అయ్యింది. రోడ్ల ఆక్రమణతో పాటు డివైడర్ ఏర్పాటుకు రూ.8 కోట్ల నిధులు మంజూరు కావాల్సి ఉంది. సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో రోడ్ల తొలగింపు తాత్కాలికంగా నిలిపి వేశాం.

–ఎం.గోపాల్, పంచాయతీ ఈఓ, పామిడి

వైఎస్సార్‌సీపీ కార్యవర్గంలో చోటు

పామిడి/బుక్కరాయసముద్రం: వైఎస్సార్‌సీపీ జిల్లా నూతన కార్యవర్గంలో పామిడివాసులకు వైఎస్సార్‌సీపీ నాయకులకు చోటు దక్కింది. అందులో పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా సాకే ఓబులేసును, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బోయ రామచంద్ర, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనుంపల్లి సూరిని ఎంపిక చేస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. తమ ఎంపికకు సహకరించిన గుంతకల్ మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, జిల్లా ఉపాధ్యాక్షురాలు నైరుతిరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా బీకేఎస్ మండల జెడ్పీటీసీ నీలం భాస్కర్‌ను నియమించారు. తన నియామకానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్, ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరి సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ నుంచి పడి వృద్ధురాలికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో గురువారం 44వ నంబర్ జాతీయ రహదారిపై ద్విచక్రవాహనంలో వెనుక కూర్చున్న ఈశ్వరమ్మ అనే వృద్ధురాలు జారి కింద పడి తీవ్రంగా గాయపడింది. వివరాలు.. అనంతపురానికి చెందిన ఈశ్వరమ్మ పని నిమిత్తం తన సమీప బంధువుతో కలిసి ద్విచక్ర వాహనంలో ప్యాపిలికి బయలుదేరింది. కొత్తపేట గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనంలో వెనుక కూర్చున్న ఈశ్వరమ్మ బైక్ నుంచి జారి రోడ్డుపై పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను గమనించిన బంధువు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జగన్‌ను కలసి వైఎస్సార్‌సీపీ నాయకులు



జగనన్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి



జగన్‌ను కలిసిన మాజీ ఎంపీటీసీ ప్రసాద్

నార్పల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.జగనన్నతో శింగనమల నిమోజకవర్గ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో నియోజక వర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శింగమనల నియోజకవర్గం వైఎస్సార్ సీపీ నాయకుడు మాజీ ఎంపీటీసీ ప్రసాద్ గురువారం కలిశారు. పార్టీ అభివృద్ధికి గ్రామస్థాయిలో విస్తృతంగా పని చేయాలని జగనన్న సూచించారన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో శింగనమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శైలజానాథ్, పుట్లూరు మండలం కడవకల్లుకు చెందిన విష్ణునారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జడ్జి కాశీ విశ్వనాథాచారి

గుత్తి: ఆర్టీసీ కార్మికులు హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ ఆచారి అన్నారు. గుత్తి ఆర్టీసీ డిపోలో గురువారం మేడే వేడుకలతో పాటు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హక్కులు, బాధ్యతలు, న్యాయం, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

డివైడర్‌ను ఢీ కొన్న కారు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పామిడి: మండలంలోని గజరాంపల్లి సమీపంలో ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఘటనలో బెంగళూరుకు చెందిన పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. బెంగుళూరు నుంచి మంత్రాలయానికి బయలుదేరిన కారు (కేఏ01ఎంజీ 8536) గజరాంపల్లి సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో డివైడర్‌ను ఢీకొని ధ్వంసమైంది. కారులో ప్రయానిస్తున్న సువర్ణ, జయమ్మ, శశికుమారు గాయపడ్డారు. స్థానికులు అప్రమత్తమై క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పామిడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మే డే వేడుకలు



తాడిపత్రిలోని రంగప్ప కాలనీలో జెండా ఎగురవేస్తున్న దృశ్యం



బీకేఎస్‌లో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు



గుంతకల్లులో జెండా ఆవిష్కరిస్తున్న జగదీష్



తాడిపత్రి పట్టణంలో



యాడికి మండలం రాయలచెరువులో..



గార్లదిన్నెలో ..

సాక్షి నెట్‌వర్క్: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో కార్మికులు మే డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ఎర్ర జెండా ఎగురవేసి అమరులకు నివాళులర్పించారు. తాడిపత్రి మండలంలోని రంగప్ప కాలనీలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రంగయ్య జెండా ఎగురవేశారు. అలాగే పట్టణంలోని గాంధీకట్ట వద్ద సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి అమరులకు నివాళులర్పించారు. గుంతకల్లులోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. అలాగే సీఐటీయూ జిల్లా నేత ఆర్.వి.నాయుడు, పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా గుత్తి రైల్వే డీజిల్ షెడ్‌లో మే డే వేడుకలను క్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే కార్మికులు ఘనంగా నిర్వహించారు. రైల్వే డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ జెండా ఆవిష్కరించారు. గుత్తి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కమిషనర్ జబ్బార్ మియా జెండా ఎగురవేశారు. అలాగే గార్లదిన్నె, పెద్దవడుగూరు, పుట్లూరు, పామిడి, బుక్కరాయసముద్రంలో కార్మిక సంఘాల నేతలు కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు, కార్మికులు, అంగన్‌వాడీ సిబ్బంది, హమాలీ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దవడుగూరులో



పామిడిలో..



గుత్తి రైల్వే డీజిల్ షెడ్‌లో మాట్లాడుతున్న సీనియర్ డీఎంఈ ప్రమోద్

'సీఎస్‌డీటీపై చర్యలు తీసుకోవాలి'

గుంతకల్లు: కలెక్టర్ ఆదేశాలను లెక్కచేయని సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ (సీఎస్‌డీటీ) సుబ్బలక్ష్మమ్మను వెంటనే క్రమశిక్షణ చర్యలు కింద సస్పెండ్ చేయాలని ధర్మ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజినేయులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆర్డీఓ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. వివరాలు.. ఎండీయూ వాహనం ద్వారా పంపిణీ చేయకపోవడంతో నెలగొండ లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందడం లేదని వీరాంజనేయులు ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆయన సంబంధిత సివిల్ సప్లయస్ డిప్యూటీ తహసీల్దార్ ఎస్.సుబ్బలక్ష్మమ్మతోపాటు తహసీల్దార్ రమాదేవిలు ఆర్డీఓ ఆధ్వర్యంలో జరిగే విచారణకు హాజరుకావాలని కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. దీంతో గురువారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీనివాస్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వీరాంజినేయులు మాట్లాడుతూ ఐదు నెలలుగా ఈ సమస్యను సివిల్ సప్లయ్ జిల్లా అధికారి, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. కలెక్టర్ నోటీసులు అందజేసినా డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్‌లు లెక్క చేయకుండా విచారణకు రాకపోవడం ఎంత వరకు సబబన్నారు. గ్రామంలో రెండు నెలలు నుంచి రేషన్ కార్డుదారులకు బియ్యం వేయకుండా వేలిముద్రలు తీసుకొని వచ్చే నెల బియ్యం అందజేస్తానంటూ డీలర్ చెబుతున్నాడు. ప్రశ్నిస్తే బియ్యం కోటా తక్కువగా వచ్చిందంటూ సమాధానం చెబుతున్నాడని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లాడు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ఇకపై ఎండీయూ వాహనంలోనే ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేయడంతోపాటు లబ్ధిదారులకు బియ్యంను అందజేస్తామన్నారు. ఇక డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్లు ప్రధాన మంత్రి మోదీ విజయవాడకు వస్తున్న నేపథ్యంలో బిజీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. దీంతో విచారణకు హాజరుకాలేదన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సదస్సులో ప్రసంగిస్తున్న జడ్జి మంజుల

గుంతకల్లు టౌన్: శ్రామికుల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గుంతకల్లు జూనియర్ సివిల్ జడ్జి జి.మంజుల అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం రాత్రి పాతగుంతకల్లులోని హమాలీ ఆఫీసులో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సుకు న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హమాలీలందరికీ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. పిల్లలను బాగా చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్మిక చట్టాలు, మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందించే న్యాయ సేవలను వివరించారు. సీఐ మస్తాన్, న్యాయవాదులు నాగేషు, నాగరాజు, కార్మికశాఖ అధికారులు, కోర్టు సిబ్బంది, హమాలీలు పాల్గొన్నారు.

ఊపిరున్నంత వరకూ వైఎస్సార్‌సీపీలోనే..



మాట్లాడుతున్న జాఫర్

గుంతకల్లు రూరల్: ఊపిరి ఉన్నంత వరకూ నేను, నా కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీలోనే ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని గుంతకల్లు మండలం సోషల్ మీడియా వైస్ ప్రసిడెంట్ జాఫర్ అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్నట్లు జాఫర్ పేరున సభ్యత్వ నమోదు కార్డును కూడా సృష్టించిన టీడీపీ శ్రేణులు వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వెంటనే స్పందించిన ఆయన గురువారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతలు చేపట్టిన ప్పటి నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. ఇది గిట్టని కొంతమంది టీడీపీ నాయకులు తన పేరున టీడీపీ సభ్యత్వ నమోదు కార్డును సృష్టించి తాను ఆ పార్టీలో చేరినట్లు ఆసత్య ప్రచారాలు మొదలుపెట్టారన్నారు. టీడీపీ శ్రేణులు ఇటువంటి పనులు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాగసముద్రం మాజీ ఎంపీటీపీ సూర్యనారాయణ, రాఘవ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

తాడిపత్రిటౌన్: పట్టణంలోని వివేకానంద పాఠశాలలో గురువారం ఉద్యోగ ఉపాధ్యాయసేవాసమితి ఆధ్వర్యంలో పేద క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. వేసవి సెలవులలో క్రీడల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో 8 మందికి ఆట వస్తువులను అందజేశామన్నారు. కార్యక్రమంలో సేవాసంస్థ అధ్యక్షుడు గురప్ప, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, కన్వీనర్ నారబోయిన శంకర్, గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

గార్లదిన్నె: ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతి ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు మండలంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ చంద్రనాయక్ తెలిపారు.గురువారం ఎంఈఓ మాట్లాడుతూ పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు కల్లూరు, గార్లదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం నుంచి ఈ నెల 17 వరకూ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. కల్లూరు కేంద్రానికి కల్లూరు, కొప్పలకొండ, ఇల్లూరు పాఠశాల విద్యార్థులు, మిగిలిన ఉన్నత పాఠశాల విద్యార్థులు గార్లదిన్నె కేంద్రంలో హాజరు కావాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు శ్రద్ధ వహించి శిక్షణ తరగతులకు ఫెయిల్ అయిన విద్యార్థులు హాజరైయ్యేలా చూడాలన్నారు.

రేపు దేవదాయ భూములకు కౌలు వేలం

పామిడి: మండలంలోని వంకరాజుకాలువ గ్రామంలోని ఆంజనేయ, భైరవస్వాముల దేవదాయ భూములకు శనివారం కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఈఓ క్రిష్ణయ్య గురువారం తెలిపారు. ఆ రోజు స్థానిక ఆలయంలో ఉదయం 11 గంటలకు ఆ భూములకు కౌలు వేలం ఉంటుందన్నారు. 2025–26, 27, 28 సంవత్సరాలకు నిర్వహించే వేలంలో పాల్గొనదలచిన వారు రూ.500 డిపాజిట్ చేయాలన్నారు. ఆసక్తి ఉనన వారు 9441012561 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

● నేత్ర దానం



నేత్రాలను అందజేస్తున్న కుటుంబసభ్యులు

పెద్దపప్పూరు: శింగనమల మండలం చక్రాయపేట వద్ద గత నెల 29న చోటు చేసుకున్న ప్రమాదంలో పెద్దపప్పూరు గ్రామానికి చెందిన టీవీ మెకానిక్ వెంకట్రామిరెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తన తండ్రి నేత్రాలతో మరో ఇద్దరికి కంటి చూపునివ్వాలన్న మహోన్నత లక్ష్యాన్ని భార్య లలిత, కుమారులు పవన్ వెంకటరెడ్డి, కరుణప్రకాష్‌రెడ్డి వ్యక్తం చేయడంతో హైదరాబాద్‌కు చెందిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి నిపుణులు వచ్చి నేత్రాలను సేకరించారు.